క్లుప్తంగా

ఆలయంలో పరిసరాల పరిశుభ్రత



ఆలయ ప్రాంగణంలో గడ్డి మందును పిచికారి చేస్తున్న కూలీలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీతూర్పు వీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కూలీలచే పిచ్చి మొక్కల తొలగించి మందులను పిచికారి చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్‌ఎస్‌ఎస్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్ శివశంకర్, శ్రీ రంగనాథ ట్రస్ట్ చైర్మన్ సీఈవో అల్లం రంగనాయకులు రాయల్, ఆలయ ఈఓ వెంకటరమణ కన్వీనర్ మేడం దినేష్ కుమార్, కార్యవర్గ సభ్యులు మల్లికార్జున, ఆలయ ప్రధాన అర్చకులు వీరేశ, శశాంక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు వితరణ



దివ్యాంగులకు దుస్తులను పంపిణీ చేస్తున్న విద్యార్థులు

పులివెందుల టౌన్ : అంధుల లిపి ప్రదాత లూయి బ్రెయిలీ స్మారకోత్సవాలను పురస్కరించుకుని జేఎన్టీయూ హెల్పింగ్ హాండ్స్ విద్యార్థులు కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ సెమినార్ హాలులో మంగళవారం ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ ఇతర అధ్యాపకులతో కలిసి బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కళాశాల ఆంగ్ల అధ్యాపకులు ప్రొఫెసర్ సాంబయ్య ఆధ్వర్యంలో హెల్పింగ్ హ్యాండ్స్ విద్యార్థులు దివ్యాంగులకు దుస్తులను వితరణగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



రెడ్డి సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి దంపతులు

పెద్దముడియం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి దంపతులు మంగళవారం ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం క్యాలెండర్‌ను వారి స్వగ్రామంలో ఆవిష్కరించారు. రెడ్డి సంఘం కార్యవర్గ సభ్యురాలు పొన్నపురెడ్డి శకుంతలరెడ్డి ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది.

పెన్షన్ వెరిఫికేషన్ తనిఖీ



లేబాకలో పెన్షన్ వెరిఫికేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్

వల్లూరు : మండలంలోని లేబాక, కొప్పోలు తదితర గ్రామ పంచాయతీలలో రూ.15,000 పెన్షన్ తీసుకుంటున్న లబ్ధిదారులకు సంబంధించి వైద్యాధికారుల బృందం ఆధ్వర్యంలో మంగళవారం వెరిఫికేషన్ నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ ఓబయ్య, డాక్టర్ సూర్య ప్రకాష్‌రెడ్డి లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి వెరిఫికేషన్ నిర్వహించారు. ఈ వెరిఫికేషన్‌ను డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా వెరిఫికేషన్‌ను నిర్వహించాలని వైద్యాధికారులకు సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఫణీంద్ర, ఎంపీడీవో రఘురామ్, ఏపీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



టెక్‌ఫెస్ట్‌లో ప్రతిభ చూపిన లయోలా పాలిటెక్నిక్ విద్యార్థులు

పులివెందుల టౌన్ : ఈనెల 6, 7వ తేదీలలో విజయవాడలో జరిగిన స్టేట్ లెవెల్ టెక్ ఫెస్ట్‌లో లయోలా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. ఈ పోటీలలో మైనింగ్ డిపార్ట్‌మెంట్ విద్యార్థులు వేణు, వీరాచార్యులు పాల్గొని ప్రథమ బహుమతిని గెలుపొందారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ బ్రిట్టో హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

నిండుగా ప్రభుత్వ కార్యాలయాలు.. ఖాళీగా కుర్చీలు

- సిబ్బందిని నియమించని ప్రభుత్వం
- పనులు జరిగేది ఎలా అంటున్న ప్రజలు

చక్రాయపేట : మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది లేక కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఏ కార్యాలయంలో చూసినా సిబ్బంది కొరత వేధిస్తుండటతో సకాలంలో పనులు జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం పలు రకాల పనుల కోసం కార్యాలయాల వద్దకు వస్తున్న ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. సిబ్బంది కొరత విషయంపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా నియామకాలు చేపట్టక పోగా ఉన్న సిబ్బందిని డిప్యుటేషన్లంటూ కొందరిని, సర్వేలు అంటూ ఇంకొందరిని ప్రభుత్వం వాడుకుంటుండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు వివరాల్లోకి వెళితే..

మండల పరిషత్ కార్యాలయం..

మండల పరిషత్ కార్యాలయాన్ని గత ప్రభుత్వం నూతనంగా ఎంతో సర్వాంగ సుందరంగా నిర్మించింది. అయితే ఈ కార్యాలయంలో ఉదయాన్నే చీపురు పట్టి చెత్త ఊడ్చే దిక్కులేదు. కార్యాలయంలో ప్రస్తుతం ఎంపీడీవో తోపాటు పరిపాలనాధికారి(ఏవో)లు మాత్రమే ఉన్నారు. ఇక్కడ ఉండాల్సిన నలుగురు అటెండర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. టైపిస్టుతో పాటు ఈవోపీఆర్ ఆర్‌డీ పోస్టు కూడా ఖాళీగానే ఉంది. ఇక్కడ ఉన్న సీనియర్ అసిస్టెంట్ గత కొన్ని నెలలుగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే విధులకు రానట్లు అధికారులు తెలుపుతున్నారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేసినా ఎలాంటి స్పందనలేదన్నారు. దీంతో



సిబ్బంది కొరత ఉన్న చక్రాయపేట ప్రభుత్వ కార్యాలయాలు

ఇక్కడ సీనియర్ అసిస్టెంట్ పోస్టు ఖాళీనే అనుకోవాల్సిందే. పంచాయతీ కార్యదర్శుల విషయానికి వస్తే మండలంలో మొత్తం 16 గ్రామ పంచాయతీలు ఉండగా కేవలం 8 మంది మాత్రమే కార్యదర్శులు ఉన్నారు. దీంతో ఉన్న వారితోనే పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ప్రతి కార్యదర్శికి అదనంగా మరో పంచాయతీ కేటాయించడంతో వారు విదిలేక భయంతో విధులు నిర్వహిస్తున్నారు. మండల ఇంజనీరింగ్ అధికారితో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరు కూడా ఇన్‌చార్జులుగానే ఉన్నారు.

మండల తహసీల్దారు కార్యాలయం..

తహసీల్దారు కార్యాలయంలోనూ తగి సిబ్బంది లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయంలో ముగ్గురు వీఆర్వో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే 5 గ్రామ సర్వేయర్ పోస్టులు ఖాళీనే. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ నియమించిన టైపిస్టు డిప్యుటేషన్‌పై ఆర్డీవో కార్యాలయంలో ఉన్నారు. మండలంలో రెవెన్యూ సమస్యలు ఉన్నా సిబ్బంది లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో కొన్ని సంవత్సరాలుగా రెండు ఏఈవో పోస్టులు భర్తీకి నోచుకోలేదు.

అలాగే పోలీస్‌స్టేషన్‌లో 5 మంది పోలీసుల కొరత ఉంది. మండలంలో సమస్యాత్మక గ్రామాలు ఉన్నాయి. చక్రాయపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు స్టాఫ్ నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పశువైద్యశాలల విషయానికి వస్తే చక్రాయపేటలో కాంపౌండరు, అటెండరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ పశువైద్యాధికారే సర్వం తానై వ్యవహరిస్తున్నారు. నాగలగుట్టపల్లె పశువైద్యశాలలో పశువైద్యాధికారి, అటెండరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడి పశువైద్యాధికారిగా చక్రాయపేట డాక్టర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. పశువైద్య సిబ్బంది కొరత కారణంగా మండలంలో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బందిని నియమించి ప్రజల ఇబ్బందులను తీర్చాలని కోరుతున్నారు.

పనులు జరగడం లేదు



సిబ్బంది కొరత కారణంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు సక్రమంగా జరగడం లేదు. ఉన్న ఇబ్బంది కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కార్యాలయాల్లో ఖాళీలు భర్తీ చేయాలని ఎన్నో సార్లు జిల్లా ఉన్నతాధికారులకు వినతిపత్రాలు కూడా ఇచ్చాను.

– కె.రామచంద్రారెడ్డి, బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు

జిల్లా సర్వసభ్య సమావేశంలోనూ ప్రస్తావించాం



ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులపై జిల్లా సర్వసభ్య సమావేశంలో ఎన్నో మార్లు ప్రస్తావించాం. అయినా ఏమాత్రం స్పందన లేదు. ఉద్యోగులే లేక పోతే ప్రజల సమస్యలు తీర్చేదెవరు. వారికి న్యాయం జరిగేదెట్లా. ఈ విషయంపై మళ్లీ జడ్పీ సమావేశంలో గట్టిగా వినిపిస్తాం.

– తాటిగొట్ల శివప్రసాదరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు చక్రాయపేట

గ్రామపంచాయతీ కార్యవర్గం ఎంపిక

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండల స్థాయి గ్రామపంచాయతీ కార్యదర్శుల సంఘం ఎంపీడీవో ఆధ్వర్యంలో మంగళవారం గ్రేడ్ వన్ నుంచి గ్రేట్ సిక్స్ వరకు పంచాయతీ కార్యదర్శులు పాల్గొని కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. కార్యవర్గ కమిటీ సభ్యులు ప్రెసిడెంట్ షేక్‌అన్వర్‌బాషా, వైస్ ప్రెసిడెంట్ గోపవరం శ్రీనివాసులు, జనరల్ సెక్రెటరీగ ప్రసాద్‌రెడ్డి, ట్రెజరర్ షేక్ గౌస్‌బాషా, మహిళా కార్యదర్శిగా ఎల్.సుప్రియరెడ్డిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్‌మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోండి

కమలాపురం : నగర పంచాయతీ పరిధిలోని వివిధ రకాల టెక్నీషియన్స్ తమ పేర్లను తమ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని నగర కమిషనర్ పగడాల జగన్నాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్లంబర్స్, పెయింటింగ్, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ, ఫ్రిజ్, టీవీ, వాషింగ్ మెషీన్ తదితర రిపేర్ చేసే మెకానిక్‌లు, బ్యూటీషియన్లు తమ పేర్లను నమోదు చేసుకుంటే మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే హోం ట్రయాంగిల్ ప్లాట్ ఫాం అనే వేదిక ద్వారా ప్రజలకు మీ సేవలను అందిస్తామన్నారు. ఇలా చేయడం వలన ప్రజలకు సేవలు అందించడంతో పాటు, అటు టెక్నీషియన్లకు జీవనోపాధి కలుగుతుందన్నారు. టెక్నీషియన్ల పేరు నమోదు చేసుకోవడానికి బుధవారం నగర పంచాయతీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశామని, టెక్నీషియన్లు 10 గంటలకు వచ్చి తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్దచెప్పలి, దేవరాజుపల్లె గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమంలో ఆయన క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో వచ్చే విపరీత మార్పులను అధిగమించాలంటే ప్రకృతి వ్యవసాయమే శరణ్యమన్నారు. సుస్థిర వ్యవసాయానికి ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు లేని కారణంగా ప్రకృతి వ్యవసాయం వెనుక ఉన్న శాస్త్రీయతను అందరూ గుర్తించాలన్నారు. యాంత్రీకరణ పద్ధతులలో భాగంగా పలు పంటలను ఆశించే పురుగుల నిఘాకు, నియంత్రణకు లింగాకర్షక బుట్టలను, జిగురు అట్టలను ఉపయోగించాలన్నారు. బీజామృతం, వేప కషాయము, ఘన జీవామృతము, ప్రకృతి వ్యవసాయ సంబంధ ద్రావకాలు, కషాయాల తయారీ ద్వారా సాగు ఖర్చును మంచి దిగుబడిని పొందవచ్చన్నారు. రైతులకు కొర్ర, మొక్క జొన్న, నూగు పంటల సాగుపై అవగాహన కల్పించారు. మొక్క జొన్న విత్తిన 48 గంటలలో 800 గ్రాముల అట్రాజిన్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. పంట విత్తిన 20–25 రోజులకు టెంబోట్రయాన్ 115 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. పొలంలో నిర్దేశిత మొక్కల సాంద్రత ఉండేటట్లు చేసుకోవాలన్నారు. మండల ఏఓ సరస్వతి మాట్లాడుతూ కొర్రపంటలో అనువైన రకాలైన సూర్య నంది, గరుడ, కృష్ణదేవరాయ, ఎస్ఐఏ-3085, 3223 మహానంది వంటి రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి



ఈకేవైసీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు

వీరపునాయునిపల్లె : ఇ పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మండలవ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. మంగళవారం ఇందుకూరు గ్రామంలో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రస్తుతం సాగులో ఉన్న పంటల గురించి రైతులతో చర్చించారు. బుడ్డ శనగ, నూగు పటలలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి రైతులకు చూసించారు. మండలంలో ఇప్పటి వరకు 4,925 మంది రైతులకు గాను 19,025 ఎకరాలలో పంట నమోదు చేశామన్నారు. వీరిలో 1035 మంది రైతులకు ఈకేవైసీ చేయించామని మిగిలిన రైతులు కూడా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఎవరైనా పంట నమోదు చేయించుకోని రైతులు ఉంటే మీ గ్రామంలోని రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి పంట నమోదుతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వాణి రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కిచెన్ గార్డెన్ కార్యక్రమం



చిరుధాన్యాలతో కేకలను తయారు చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధి బ్రాహ్మణపల్లెలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఫుడ్‌అండ్‌సైన్స్, టెక్నాలజీ కళాశాల అధ్యాపకుడు సాయిశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు అతి సులువుగా రాగి, జొన్నలు తదితర చిరు ధాన్యాలతో కేక్‌ల తయారీ విధానాలను స్వయంగా తయారు చేసి చూపించారు. అనంతరం పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేసి కూరగాయల, ఆకు కూరల విత్తనాలను నాటారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జయమ్మ, డాక్టర్ నివేదిత, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, కళాశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్మశానానికి స్థలం ఇవ్వండి సారూ..



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శివరామిరెడ్డి

కమలాపురం : తమ గ్రామానికి స్మశానం లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని స్థలం కేటాయించాలని మండలంలోని సి.గోపులాపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆ గ్రామ ప్రజలు తహసీల్దార్ శివరామిరెడ్డిని కోరారు. స్పందించిన తహసీల్దార్ అర్జీ ఇవ్వాలని, పరిశీలించి స్థలం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ప్రజలు అర్జీ ఇచ్చారు. అనంతరం ఆయన సర్వేయర్, వీఆర్‌ఓతో కలసి గ్రామం సమీపంలో ఉన్న వంక పోరంబోకు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, సి.గోపులాపురం గ్రామం చాలా ప్రశాంతంగా ఉందని, ఎలాంటి భూ సమస్యలు లేవన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు స్పందన కరువు



దేవతాపురం రెవెన్యూ సదస్సుకు హాజరుకానీ ప్రజలు

సింహాద్రిపురం : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గత ఏడాది డిసెంబర్ 6వ తేదీనుంచి ఈనెల 8వ తేదీవరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అయితే గ్రామాల్లో చేపట్టిన రెవెన్యూ సదస్సులకు ప్రజల నుంచి స్పందన కరువైంది. మంగళవారం మండలంలోని దేవతాపురం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ప్రజలెవరూ హాజరు కాలేదు. కేవలం ఆధార్‌కార్డు అప్‌డేట్ కొరకు మాత్రం ఇద్దరు దరఖాసులు చేసుకున్నారు. కార్యక్రమంలో డీటీ హరిబాబు, సచివాలయ సర్వేయర్ మధు, వీఆర్‌ఓ రాజకుళ్లాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మంచి ఆహార అలవాట్లను అలవర్చుకోవాలి

వేంపల్లె : ప్రతి ఒక్కరూ మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని తాళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్వాతి సాయి తెలిపారు. మంగళవారం స్థానిక శ్రీ వాసవి కల్యాణ మండపంలో ఆవోపా మహిళా విభాగ్ ఆధ్వర్యంలో మహిళల్లో పౌష్టికాహార ప్రాధాన్యత గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూక్తిని అనుసరిస్తూ పూర్తిగా కాలుష్యపు కోరల్లో చిక్కుకొని పోయిన ప్రస్తుత కాలంలో మహిళల యొక్క ఆరోగ్య పరిరక్షణ నిత్యజీవితంలో పౌష్టికాహార ప్రాధాన్యత ఎంతో అవసరమన్నారు. మహిళల్లో మంచి ఆహారపు అలవాట్లతో పాటు శరీరానికి తగు వ్యాయామం ఉన్నచో అన్ని రకాల క్యాన్సర్లకు దూరంగా ఉండవచ్చునున్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆవోప మహిళా విభాగ అధ్యక్షురాలు పచ్చిపులుసు ప్రవీణ, ఏఎన్‌ఎం తులసి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

వల్లూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు సంభందించి సామాజిక తనిఖీ ప్రజా వేదిక జరుగుతుందని ఎంపీడీవో రఘురాం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో 2023 ఏప్రిల్ 1వ తేదీ నుండి 2024 మార్చి 31 వరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులకు సంభందించి మంగళవారం వరకు సామాజిక తనిఖీ బృందం ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ పూర్తయిందని తెలిపారు.

సమస్యలపై వినతి

చింతకొమ్మదిన్నె : మండలంలోని చెర్లోపల్లె అంగన్‌వాడీ పాఠశాల ఆవరణలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతుల నుండి మ్యుటేషన్ కొరకు, ఆర్‌ఓఆర్ సమస్యలు, అడంగల్ కరెక్షన్, భూమి స్వభావం మార్పు తదితర విషయాలపై 40 అర్జీలు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. సదస్సుకు చెర్లోపల్లె లే అవుట్ ప్రజలు తరలివచ్చి తమ లే అవుట్‌లో ప్రజలకు స్మశాన స్థలం కేటాయించాలని, రోడ్లు, గుడి ఏర్పాటు చేయాలని తహసీల్దార్ నాగేశ్వరరావుకు సదస్సులో వినతిపత్రాలు ఇచ్చారు.

చెన్నూరు..

వల్లూరు (చెన్నూరు) : మండలంలోని రుద్రభారతి పేట, రాచిన్నాయపల్లెలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ సరస్వతి పాల్గొని మాట్లాడారు. రెవెన్యూ సదస్సులలో రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి యొక్క భూసమస్యలను తెలుసుకుంటామన్నారు. వచ్చిన భూ సమస్యలను 45 రోజులలోగా పరిష్కరిస్తామన్నారు. అనంతరం రైతుల నుండి భూ సమస్యలకు సంబంధించి పత్రాలు స్వీకరించారు. ఆర్ఐ కౌశిక్, సర్వేయర్ సోమశేఖర్, విలేజ్ సర్వేలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

నువ్వు పంటలో తెగులుపై జాగ్రత్త వహించడం

ముద్దనూరు : నువ్వుల సాగులో వ్యాపించిన తెగులు నివారణపై రైతులు జాగ్రత్త వహించాలని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం ఆయన పెనికలపాడు గ్రామంలో నువ్వుల పంటను పరిశీలించారు. ఈ పంటలో పిల్లోడి(వెర్రి)వైరస్ వుందని, ఈ లక్షణాలు కనిపించిన వెంటనే వాటిని పీకి వేసి పక్కన పూడ్చి వేయాలని తెలిపారు. ఈ తెగులు నివారణకు 0.3 గ్రాముల ఇమిడాక్లోపిడ్ లేదా 0.3 గ్రాముల అస్టమా ప్రైడ్‌ను 1 లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. దీనితో పాటు బూడిద తెగులు నివారణకు 3 గ్రాముల వెటబుల్ సల్ఫర్ అనే మందును 1లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని ఏఓ తెలిపారు.

నివాళి

చింతకొమ్మదిన్నె : క్రిష్ణాపురం గ్రామ నివాసి రిటైర్డ్ హెడ్మాస్టర్ లేట్ గాలి కృష్ణమూర్తి సతీమణి గాలి రామలక్షుమ్మ (87) సోమవారం మృతి చెందారు. విషయం తెలిసిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి మంగళవారం వారి ఇంటికి వెళ్లి ఆమెకు నివాళులర్పించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి



ఆన్‌లైన్ శిక్షణకు హాజరైన ఎంపీడీవోలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది

వల్లూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు సంబంధించి జరుగుతున్న ఆన్‌లైన్ శిక్షణను సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని కమలాపురం, వల్లూరు మండలాల ఎంపీడీవోలు జ్యోతి, రఘురాం తెలిపారు. రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ వారి ఆధ్వర్యంలో రాబోవు 6 నెలల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేయవలసిన కార్యక్రమాలపై మంగళవారం ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమం జరిగింది. వల్లూరు, కమలాపురం మండలాలకు చెందిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో కలిసి వారు వల్లూరు ఎంపీడీవో కార్యాలయ సభా భవనంలో ఆన్‌లైన్ శిక్షణకు హాజరయ్యారు. ఈ శిక్షణ కార్యక్రమానికి వల్లూరు, కమలాపురం మండలాల ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవోలు సుధారాణి, పార్థ సారధి, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



వల్లూరులో సర్వేను పరిశీలిస్తున్న జిల్లా టీబీ, లెప్రసీ ఎన్సీడీ నోడల్ ఆఫీసర్ రవిబాబు

వల్లూరు : వైద్య ఆరోగ్య శాఖ ద్వారా నిర్వహించే వివిధ కార్యక్రమాలపై ఆశా కార్యకర్తలు విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా టీబీ, లెప్రసీ ఎన్సీడీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రవిబాబు తెలిపారు. వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్సీడీ ప్రోగ్రాం కింద పరీక్షలు నిర్వహించి బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి సకాలంలో సరైన వైద్య సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. లెప్రసీ సర్వేను విజయవంతం చేయాలన్నారు. ఫిజియోథెరపిస్ట్ మనోహర్ లెప్రసీ కేసులను గుర్తించడం, వ్యాధిగ్రస్తులకు సర్వే చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రసన్నలక్ష్మి, సీహెచ్‌ఓ వేణు గోపాల్, హెల్త్ సూపర్వైజర్‌లు మమత, సుధాకర్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాయమాటలు చెప్పి రూ.10 లక్షలకు టోకరా

బెంగళూరులోని భార్యాభర్తలపై కేసు నమోదు

ముద్దనూరు : మాయమాటలు చెప్పి జీతం పెరుగుతుందని రూ.10,62,620 కాజేసిన బెంగళూరు కంపెనీ వాసులపై స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. ఎస్ఐ మైనుద్దీన్ సమాచారం మేరకు.. మండలంలోని మంగపట్నం గ్రామానికి చెందిన మంజునాథ అనే యువకుడు బెంగళూరులోని ఎడ్-వేద అనే ఎడ్యుకేషనల్ కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. కంపెనీ యజమాని సాయిచరణ్, అతని భార్య డైరక్టర్ రేష్మలు కంపెనీ అభివృద్ధి చెందితే అందరికీ జీతాలు పెరుగుతాయిని నమ్మబలికారు. ఈ మాటలు నమ్మి 2024 ఫిబ్రవరి మంజునాథ ఫోన్‌పే ద్వారా రూ.8,62,620 వారికి చెల్లించారు. అనంతరం జూన్ నెలలో వారిరువురు మంజునాథ తల్లితండ్రుల వద్దకు వచ్చి కంపెనీ అభివృద్ధి చెందితే మీ కుమారుడు బాగుపడుతాడని మాయమాటలు చెప్పడంతో వారు నెఫ్ట్ ద్వారా రూ.2 లక్షలు సాయిచరణ్ అకౌంట్‌కు బదిలీ చేశారు. మొత్తం రూ.10,62,620 కాజేశారు. సుమారు 15 నెలలనుంచి జీతం కూడా చెల్లించడంలేదని, డబ్బులు అడిగితే బెదిరించాడని మంజునాథ ఫిర్యాదు చేశారు. పెద్ద మనుషుల వద్ద పంచాయతీ పెట్టడంతో వారి కారు, మోటర్ సైకిల్ మంజునాథకు ఇచ్చి డబ్బులు చెల్లించిన తర్వాత తీసుకుంటామని తెలిపారు. అనంతరం వారు కారు, మోటర్ సైకిల్ దొంగలించినట్లు తమపైనే బెంగళూరులో కేసు పెట్టారని తెలిపారు. తనకు, తన తల్లిండ్రులకు మాయమాటలు చెప్పి సొమ్ము కాజేసిన సాయిచరణ్ అతని భార్య రేష్మపై చర్యలు తీసుకోవాలని మంజునాథ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

10న నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలు

కమలాపురం : స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో ఈనెల 10వ తేదీన నియోజకవర్గస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మంగళవారం కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్ రెడ్డి తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని భారత ప్రభుత్వం, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ కేంద్రం కడప శాఖ, మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ పర్యవేక్షణలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. 15–29 సం.లోపు వారు ఈ పోటీలకు అర్హులన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ట్రోఫీతో పాటు క్యాష్ ప్రైజ్ ఇస్తామన్నారు. అలాగే ప్రతి ఒక్కరికి భారత ప్రభుత్వం తరపున సర్టిఫికెట్స్ అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 93814 54069, 63014 23495 నెంబర్లకు సంప్రదించి గురువారం సాయంత్రంలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం అధికారి మణికంఠ, మదర్ థెరిసా ట్రస్ట్ చైర్మన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా మండల పూజ



కోలాట ప్రదర్శనలో చిన్నారులు

వేముల : మండలంలోని చిన్నగొందిపల్లెలో మంగళవారం శ్రీ అభయాంజనేయస్వామి 41 రోజుల మండల పూజ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామంలో గత ఏడాది నవంబర్ 28వ తేదీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. 41 రోజులపాటు ప్రత్యేక పూజల అనంతరం మంగళవారం మండల పూజ కార్యక్రమాన్ని పురోహితులు కిరణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మండల పూజ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండల పూజలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి మూలవిరాట్